RNI NO .TGTEL/25/A4366

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి : 01 సంచిక :50 ఆదివారం 25 జనవరి 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-

### బిఆర్ఎస్ హయాంలోనే స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి



4 లో

# పుర'పోరు'ను లైట్ తీసుకుంటున్న మంత్రులు

## సర్కారుకు అందిన ఇంటెలిజెన్స్ రిపోర్టు!

- మున్సిపల్ ఎన్నికలపై మంత్రుల నిర్లక్ష్యం?
- ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చినా ఫీల్డ్‌లోకి దిగని సగం మంది
- హైదరాబాద్ దాటని మంత్రులపై పార్టీ వర్గాల అసంతృప్తి
- కేడర్‌తో సమన్వయానికి దూరంగా ఉన్న నేతలు
- మంత్రి పర్యటనలపై ఇంటెలిజెన్స్ నిఘా
- సమన్వయ సమావేశాలు నిర్వహించని మంత్రులకు పీసీసీ ఫోన్లు
- ఆశావహుల స్క్రూటినీపై ఆలస్యం
- ఫిబ్రవరి 2న సీఎంపార్టీ ఇన్‌చార్జ్ కీలక రివ్యూ సమావేశం

**న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్)**

మున్సిపల్ ఎన్నికలను సగం మంది మంత్రులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. లోక్ సభ నియోజకవర్గాల వారీగా మంత్రులకు ఇన్ చార్జి బాధ్యతలు అప్పగించి వారం రోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకు సగం మంది మంత్రులు మాత్రమే రంగంలోకి దిగారు. ఫీల్డ్‌లోకి వెళ్లి పార్టీ కేడర్‌తో సమావేశాలు నిర్వహించారు. అయితే మిగతా మంత్రులు ఫీల్డ్‌లో వెళ్లేందుకు అయిష్టంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

మిగతా 2 లో




### రైల్వే పట్టాలపై భారీ పేలుడు

12 అడుగుల మేర ధ్వంసమైన ట్రాక్



2 లో

### ఫోన్ ట్యాపింగ్ కేసులో నెక్స్ట్ కవితకు నోటీసులు?



2 లో

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. బీఆర్ఎస్ లోని అగ్రనేతలకు వరుసగా నోటీసులు ఇస్తున్న దర్యాప్తు బృందం ఈ క్రమంలో తదుపరి నోటీసులు ఎవరికి ఇవ్వబోతోందనే సస్పెన్స్ అందరిలో వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సిట్ విచారించబోతున్నట్లు తెలుస్తోంది. కవితతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్, బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సంతోశ్ రావుకు నోటీసులు ఇచ్చేందుకు సిట్ సిద్ధమైందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా జరుగుతోంది

### నిజామాబాద్‌లో గంజాయి ముఠా బరితెగింపు.. మహిళా కానిస్టేబుల్‌పై ఘాతుకం



2 లో

### ఆధారాలివ్వకుంటే క్రిమినల్ చర్యలు తప్పవు.. ఆర్ఎస్ ప్రవీణ్‌కు సజ్జనార్ నోటీసులు



2 లో

### మేడారం జాతరకు కేంద్రం సాయం




2 లో

### ఇదొక భారీ విజయం.. భారత్ పై 25 శాతం పన్ను తగ్గొచ్చు : హింటిచ్చిన అమెరికా మంత్రి




2 లో

### ప్రసాదం కౌంటర్ లో ఎలుకలు.. ఇద్దరు ఉద్యోగుల సస్పెండ్



2 లో

### తండ్రి తిట్టాడని.. హాస్టల్ పై నుంచి దూకి బీటెక్ స్టూడెంట్ ఆత్మహత్య



2 లో

### అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ఎయిరిండియాకు రూ.1100కోట్ల బీమా సొమ్ము



2 లో

# అతిరథ మహారథులతో ఘనంగా తెలుగుగళం కేలండర్ ఆవిష్కరణ"



5 లో

# పుర'పోరు'ను లైట్ తీసుకుంటున్న మంత్రులు.. సర్కారుకు అందిన ఇంటెలిజెన్స్ రిపోర్టు!

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ దాటని మంత్రులు!

మేడారంలో ఈనెల 18న కేబినెట్ మీటింగ్ జరిగింది. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి లోక్ సభ నియోజకవర్గాల వారీగా మంత్రులను ఇన్ చార్జిలుగా నియమించారు. ఎలక్షన్ షెడ్యూల్ వచ్చేలోపు క్షేత్ర స్థాయిలో పర్యటించి పార్టీ పరిస్థితులపై రిపోర్ట్ ఇవ్వాలని టార్గెట్ పెట్టారు. మంత్రులు ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని లీడర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి, పార్టీ పరిస్థితులు, పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఆశావహుల జాబితాను పీసీసీకు అందించాల్సి ఉన్నది. కానీ సగం మంది మంత్రులు ఇప్పటివరకు తమకు అప్పగించిన నియోజకవర్గాల్లో పర్యటించలేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల బాధ్యతలు తీసుకునేందుకు కొందరు మంత్రులు అయిష్టంగా ఉన్నారని, అందుకే తమకు అప్పగించిన ఏరియాల్లో పర్యటించడం లేదని చర్చ జరుగుతున్నది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించని మంత్రులు.. కింది స్థాయి లీడర్లకు ఎలాంటి సంకేతాలు పంపిస్తున్నారని పీసీసీ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఇతర పనులతో బిజీగా ఉంటూ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు టైం కుదరపోతే ఇబ్బంది లేదు కానీ.. కొందరు మంత్రులు మాత్రం హైదరాబాద్ లో ఉంటూ కాలయాపన చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

మంత్రుల పర్యటనపై ఆరా..

ఇప్పటివరకు ఏ మంత్రి ఎక్కడ పర్యటించారు? ఎక్కడ సమన్వయం సమావేశం నిర్వహించారు? ఎందరి అభిప్రాయాలు తీసుకున్నారు? అనే కోణంలో నిఘా వర్గాలు సమాచారం సేకరిస్తున్నాయి. శుక్రవారం వరకు కేవలం సగం మంది మంత్రులు మాత్రమే తమకు అప్పగించిన పార్లమెంట్ నియోజకవర్గాల్లోని లీడర్లతో సమావేశం నిర్వహించినట్లు ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు తెలిసింది. ఇంతవరకు సమన్వయ సమావేశం నిర్వహించని మంత్రులకు పీసీసీ వర్గాలు ఫోన్ చేసి 'షెడ్యూలు వచ్చేలోపు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహుల జాబితా స్క్రూట్నీ చేయాలి. త్వరగా మీటింగ్ పెట్టి రిపోర్టు ఇవ్వండి'అని రిక్వెస్టు చేస్తున్నట్లు సమాచారం.

2న సీఎం, మీనాక్షి నటరాజన్ రివ్యూ..?

విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి ఒకటో తేదీన హైదరాబాద్ చేరుకోనున్నారు. రెండో తేదీన పార్టీ ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ తో కలిసి మున్సిపల్ ఎన్నికలపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నారు. ఆ మీటింగులోనే పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఇన్ చార్జి మంత్రులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఫిబ్రవరి మూడు నుంచి వరుసగా ఆరు రోజుల పాటు సీఎం ఎన్నికల ప్రచారం కోసం జిల్లాల్లో పర్యటించేందుకు షెడ్యూలు తయారు చేసుకున్నారు.

# ఆధారాలివ్వకుంటే క్రిమినల్ చర్యలు తప్పవు.. ఆర్ఎస్ పవీణ్‌కు సజ్జనార్ నోటీసులు

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు సిట్ అధికారి, సీపీ సజ్జనార్ నోటీసులు పంపించారు. నాపై ఏడు కేసులు ఉన్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. నాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలి. రెండ్రోజుల్లో ఆధారాలు ఇవ్వకపోతే క్రిమినల్ చర్యలు తప్పవని సజ్జనార్ హెచ్చరించారు.

ఆర్ఎస్ ప్రవీణ్ ఏమన్నారంటే..? కాగా, శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఒక పోలీస్ అధికారిగా ఫోన్ ట్యాపింగ్ విషయం తనకు తెలుసని.. అత్యంత గోప్యంగా ఉంచాల్సిన ఈ అంశాన్ని.. రేవంత్‌రెడ్డి బజారున పడేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను వేధించేందుకు అక్రమ సిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. సజ్జనార్ సిట్ అధికారిగా ఉన్నారని.. ఆయనపై ఏడు కేసులు ఉన్నాయని.. ఆయన సిట్ చీఫ్‌గా ఉండడం ఏందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ను విచారించే నైతిక హక్కు సజ్జనార్, శివధర్‌రెడ్డి ఇద్దరికీ లేదని ప్రవీణ్ కుమార్ అన్నారు. దీంతో తాజాగా స్పందించిన సజ్జనార్ తనపై ఉన్న ఏడు కేసుల వివరాలు ఇవ్వాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు నోటీసులు ఇచ్చారు.

# మేడారం జాతరకు కేంద్రం సాయం

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): మేడారం మహా జాతర కు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.3.70 కోట్ల నిధులు కేటాయిస్తూ శుక్రవారం కేంద్ర ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులను కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా మంజూరు చేశాయి. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం జాతరకు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తుండటంతో.. భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సమ్మక్క – సారలమ్మల జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి జాతరతో భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నిరంతరంగా సహకారం అందించడం గిరిజన సంస్కృతి పరిరక్షణకు తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఇదొక భారీ విజయం.. భారత్ పై 25 శాతం పన్ను తగ్గొచ్చు : హింటిచ్చిన అమెరికా మంత్రి

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్ పై అమెరికా అదనపు పన్ను విధించిన విషయం తెలిసిందే. ఈ పన్ను నుంచి త్వరలోనే భారత్ కు ఉపశమనం కలిగే అవకాశం ఉన్నట్లుగా అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ హింటిచ్చారు. ప్రస్తుతం భారత్ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను తగ్గించుకోవడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. గతంలో రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయడంతో అదనంగా 25 శాతం టారిఫ్ విధించడంతో.. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై 50 శాతం పన్నులు అమలవుతున్నాయి. ఇప్పుడు చమురు కొనుగోళ్లు తగ్గించుకోవడంతో.. త్వరలోనే 25 శాతం పన్నులు తగ్గించే ఛాన్స్ ఉన్నట్లు స్కాట్ అభిప్రాయపడ్డారు. ఇదొక భారీ విజయమని పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న దేశాలపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో భారత్‌పై మొత్తం 50 శాతం వరకు టారిఫ్‌లు ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. 2025 ఆగస్టులో ట్రంప్ భారత దిగుమతులపై టారిఫ్‌లను రెట్టింపు చేసి 50 శాతానికి పెంచారు.

# ప్రసాదం కౌంటర్ లో ఎలుకలు.. ఇద్దరు ఉద్యోగుల సస్పెండ్

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): అన్నవరం ప్రసాదం మరోసారి వివాదానికి కేంద్ర బిందువైంది. ప్రసాదంలో నత్త వచ్చిందంటూ ఇటీవల ఓ జంట హడావిడి చేశారు. వీడియోను తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దాంతో అన్నవరం ప్రసాదం అపవిత్రమైందంటూ నెటిజన్లు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేయగా.. దేవాలయ అధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. ప్రసాదం చాలా పరిశుద్ధమైన విధానంలో చేస్తారని, అందులో నత్త వచ్చే అవకాశమే లేదని స్పష్టం చేశారు. సదరు జంట కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని కూడా అన్నారు. దేవాలయ పేరు ప్రతిష్టాలను దెబ్బతీసేందుకు కుట్రపూరితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆ ఘటనపై పోలీసులకు కూడా అధికారులు ఫిర్యాదు చేయగా జంటపై కేసు నమోదైంది. ఇప్పుడు ఈ ఘటనను మరవక ముందే ప్రసాదానికి సంబంధించిన మరో వివాదం తలెత్తింది.

అన్నవరం హైవేపై ఉన్న ప్రసాదం కౌంటర్ లో ఎలుకలు చక్కర్లు కొడుతూ కనిపించాయి. ప్రసాదం బుట్టలో దుంకుతూ, పరుగులు పెడుగూ ఎలుకలు హడావిడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విశాఖకు చెందిన ఓ భక్తులు వీడియోను పోస్టు చేయడంతో అన్నవరం ప్రసాదం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఈ విషయమై అక్కడ సిబ్బంది భక్తులు ప్రశ్నించగా.. కొనుక్కుంటే కొనుక్కోండి లేదంటే వెళ్లిపోండంటూ దురుసుగా సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రసాదం కౌంటర్ ఎలుకల హల్ చల్ విషయం కాస్త అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో అధికారులు చాలా సీరియస్ అయ్యారు. ఘటనపై విచారణ జరిపించారు. ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ దేవస్థానం ఈఓ ఉత్తర్వులను జారీ చేశారు.

# తండ్రి తిట్టాడని.. హాస్టల్ పై నుంచి దూకి బీటెక్ స్టూడెంట్ ఆత్మహత్య

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): అతను చేసిన పనికి తండ్రి తీవ్రంగా తిట్టడంతో మనస్తాపం చెందిన బీటెక్ సెకండియర్ స్టూడెంట్.. హాస్టల్ భవనం నాల్గవ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గ్రేటర్ నోయిడాలోని నాలెడ్జ్ పార్క్ ఏరియాలో జరిగింది. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. పోలీసులు మృతుడిని ఝాన్సీ జిల్లావాసి అయిన ఉదిత్ సోని (24)గా గుర్తించారు. ఉదిత్ హాస్టల్ పైనుంచి దూకడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే సిబ్బంది ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు.

గ్రేటర్ నోయిడా అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం (జనవరి 23) రాత్రి ఉదిత్ సోని, అతని స్నేహితులైన చేతన్, కుల్ దీప్ లతో కలిసి మద్యం సేవించాడు. అనంతరం నాలెడ్జ్ పార్క్ –3లో ఉన్న తన హాస్టల్ కు వెళ్లాడు. ఉదిత్ మద్యం సేవించినట్లు గమనించిన హాస్టల్ యాజమాన్యం.. అతన్ని మందలించంది. ఆపై ఉదిత్ వీడియోను రికార్డ్ చేసి తండ్రి విజయ్ సోనికి పంపింది. దీంతో విజయ్ కోపంగా ఉదిత్ కు ఫోన్ చేసి తిట్టారు. ఇలా చేస్తే హాస్టల్ నుంచి ఇంటికి తీసుకెళ్లిపోతానని హెచ్చరించారు. తండ్రి తిట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉదిత్.. హాస్టల్ పైనుంచి దూకి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపి.. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ఎయిరిండియాకు రూ.1100కోట్ల బీమా సొమ్ము

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): అహ్మదాబాద్‌లో గతేడాది జూన్ 12న జరిగిన డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదానికి సంబంధించిన బీమా క్లెయిమ్‌లలో భాగంగా గ్లోబల్ రీఇన్సూరెన్స్ సంస్థలు, భారతీయ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ఎయిర్ ఇండియాకు ఇప్పటివరకు సుమారు 125 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1,125 కోట్లు) చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం విమానం (హల్) ఇంజిన్ల నష్టానికి సంబంధించిన బీమా క్లెయిమ్‌గా చెల్లించబడినట్లు బీమా వర్గాలు వెల్లడించాయి. అలాగే ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికుల కుటుంబాలకు పరిహారంగా 25 మిలియన్ డాలర్లు (సుమారు రూ.225 కోట్లు) విడుదల చేసే ప్రక్రియను కూడా పూర్తిచేశారు. అయితే బాధిత కుటుంబాలకు పరిహారం అందించే ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని, పూర్తి స్థాయిలో ప్రాసెస్ పూర్తయిన తర్వాత ఈ మొత్తం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. ఇంతకుముందు భారతీయ రీఇన్సూరర్ జీఐసీ రీ తెలిపిన ప్రకారం, ఈ ప్రమాదానికి సంబంధించిన ఎయిర్ ఇండియా మొత్తం క్లెయిమ్ విలువ సుమారు 475 మిలియన్ డాలర్లకు (రూ.4,275 కోట్లు) చేరే అవకాశముంది. ఇందులో 260 మంది మృతి చెందిన ఘటనకు సంబంధించి బాధ్యత పరిహారంగా మాత్రమే 350 మిలియన్ డాలర్లు ఉండనున్నాయి. అహ్మదాబాద్ నుంచి లండన్ గాట్విక్‌కు వెళ్లాల్సిన ఏఐ–171 విమానం (బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్) అహ్మదాబాద్ సమీపంలో కూలి 260 మంది మృతి చెందారు. విమానం పూర్తిగా ధ్వంసమైంది. ప్రాథమికంగా చెల్లించిన 125 మిలియన్ డాలర్లలో 80 మిలియన్ డాలర్లు విమానం హల్ నష్టానికి, మరో 25 మిలియన్ డాలర్లు రెండు ఇంజిన్లకు సంబంధించినవి. ఈ డీల్‌లో భాగస్వామ్యమైన ఒక రీఇన్సూరర్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదానికి ముందు విమానానికి ఇంజిన్ మెయింటెనెన్స్ జరిగిందని, తాత్కాలికంగా కొత్త ఇంజిన్ అమర్చారని చెప్పారు. పాత ఇంజిన్ ఇప్పుడు బీమా సంస్థల స్వాధీనంలోకి వచ్చిందని, దానిని అమ్మి కొంత మొత్తాన్ని తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. హల్, ఇంజిన్లకు సంబంధించిన క్లెయిమ్‌లు ఇప్పటికే సెటిల్ అయ్యాయని, ప్రయాణికుల పరిహార క్లెయిమ్‌లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ అంశంపై స్పష్టత కోరుతూ ఎయిర్ ఇండియాకు ఒక నేషనల్ మీడియా సంస్థ ఈమెయిల్ పంపగా.. దానిపై స్పందన లేదని పేర్కొంది. ఈ ప్రమాదానికి సంబంధించిన ఎయిర్ ఇండియా బీమా క్లెయిమ్ విమాన బీమా చరిత్రలోనే అతిపెద్ద క్లెయిమ్‌లలో ఒకటిగా మారింది. ఏప్రిల్ 1 నుంచి ఎయిర్ ఇండియా తన 20 బిలియన్ డాలర్ల హల్ బీమా పాలసీ, 1.5 బిలియన్ డాలర్ల లయబిలిటీ పాలసీని అమెరికాకు చెందిన ఏఐజి నేతృత్వంలో పునరుద్ధరించింది. ఈ పాలసీలో దాదాపు 95 శాతం వరకు రీఇన్సూరెన్స్ చేయబడింది. ప్రాథమిక బీమా సంస్థల్లో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ 40 శాతం వాటాతో ముందుండగా, న్యూ ఇండియా అష్యూరెన్స్ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కూడా భాగస్వాములయ్యాయి. అయితే రీఇన్సూరెన్స్ ఎక్కువగా ఉండటంతో ప్రాథమిక సంస్థలపై భారం తక్కువగా ఉంటుందని వర్గాలు చెబుతున్నాయి.

# సింగరేణి బొగ్గు బావులపై ఏ గద్దనూ వాలనివ్వ.. డిప్యూటీ సీఎం భట్టి మాస్ వార్నింగ్




సింగరేణి బొగ్గు బావులపై ఏ గద్దనూ వాలనివ్వను..వాస్తవాలు తెలుసుకోకుండా అడ్డగోలుగా ఏది పడితే అది రాస్తే సాగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి ఆస్తులు సంపాదించుకునేందుకు రాలేదని, సమాజంలో మార్పు కోసమే వచ్చానని అన్నారు. తాను చేపట్టిన పాదయాత్ర సమయంలో కూడా సింగరేణి కోసం పోరాడానని గుర్తు చేశారు. సింగరేణిపై ఏ గద్దనూ వాలనివ్వనని.. బొగ్గు బావులు తెలంగాణకు ఎంత అవసరమో తనకు తెలుసని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

# రైల్వే పట్టాలపై భారీ పేలుడు.. 12 అడుగుల మేర ధ్వంసమైన ట్రాక్

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): ల్వే పట్టాలపై భారీ పేలుడు సంభవించి.. ట్రాక్ 2 అడుగుల మేర ధ్వంసమైంది. ఈ షాకింగ్ ఘటన శనివారం ఉదయం పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని సిరిహింద్ వద్ద అమృతసర్–ఢిల్లీ ప్రధాన రైల్వే లైన్‌పై చోటు చేసుకుంది. గణతంత్ర వేడుకలకు ముందు భారీ విద్రోహ కుట్ర వెలుగు చూడటం దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. భారీ పేలుడు ధాటికి పట్టాలు సుమారు 12 అడుగుల మేర తునాతునకలయ్యాయి. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఒక సరుకు రవాణా రైలు ఇంజన్ ఈ పేలుడు దాటికి దెబ్బతినగా, లోకో పైలట్ తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రత ఎంతలా ఉందంటే, కిలోమీటర్ల దూరం వరకు ఆ శబ్దం వినిపించడంతో స్థానికులను భయాందోళనకు గురి చేసింది.

కాగా ఈ పేలుడు సమాచారం అందుకున్న వెంటనే.. ఘటనా స్థలానికి చేరుకున్న ఫోరెన్సిక్ బృందాలు అక్కడ హై–గ్రేడ్ పేలుడు పదార్థాలు వాడినట్లు ప్రాథమికంగా గుర్తించాయి. రిపబ్లిక్ డే సమీపిస్తున్న తరుణంలో, రైళ్లను లక్ష్యంగా చేసుకుని భారీ ప్రాణనష్టం కలిగించేందుకే ఉగ్రవాదులు, విద్రోహ శక్తులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. పంజాబ్ పోలీసులు, రైల్వే రక్షణ దళం ఉమ్మడిగా దర్యాప్తు చేపట్టి, సరిహద్దు ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించాయి. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా రైల్వే భద్రతను అధికారులు మరోసారి కట్టుదిట్టం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో నెక్స్ట్ కవితకు నోటీసులు?

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. బీఆర్ఎస్ లోని అగ్రనేతలకు వరుసగా నోటీసులు ఇస్తున్న దర్యాప్తు బృందం ఈ క్రమంలో తదుపరి నోటీసులు ఎవరికి ఇవ్వబోతోందనే సస్పెన్స్ అందరిలో వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సిట్ విచారించబోతున్నట్లు తెలుస్తోంది. కవితతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్, బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సంతోశ్ రావుకు నోటీసులు ఇచ్చేందుకు సిట్ సిద్ధమైందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా జరుగుతోంది. అతి త్వరలోనే వీరికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆఖర్లో కేసీఆర్!

సుదీర్ఘంగా కొనసాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో తాజాగా ఊహించని మలుపులు నమోదు అవుతున్నాయి. హరీశ్ రావు, కేటీఆర్‌ను బ్యాక్ టు బ్యాక్ ప్రశ్నించి వారి స్టేట్ మెంట్ రికార్డు చేసుకుంది. తాజాగా కవిత నుంచి స్టేట్ మెంట్ తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తన భర్త ఫోన్లను ట్యాప్ చేశారని కవిత గతంలో అనేక సందర్భాల్లో ఆరోపణలు చేశారు. అయితే ఈ కేసులో వరుసగా కేసీఆర్ కుటుంబ సభ్యులకు సిట్ నోటీసులు ఇస్తున్న నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన కేసీఆర్ కుటుంబ సభ్యులనంతా ప్రశ్నించాక ఆఖర్లో కేసీఆర్ ను విచారణకు పిలిచే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

# ప్రత్యేక స్టార్టప్‌లకు కేంద్రంగానే 'టీ హబ్'.. సీఎస్‌కు సీఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): టీ–హబ్ లక్ష్యాన్ని నీరుగార్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, దేశంలోనే ఆధునాతన ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా నిలిచిన ఈ కేంద్రంలోకి అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను షిఫ్ట్ చేయబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాతో పాటు ప్రధాన పత్రికల్లో వార్తా కథనాలుగా వచ్చాయి. అందుకు సంబంధించి ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసింది. అయితే, ప్రజల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో తాజాగా ఆ నిర్ణయంపై సర్కారు వెనక్కి తగ్గింది. ఈ మేరకు ప్రస్తుతం అమెరికా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ రామకృష్ణా రావుకు ఫోన్ చేసి కీలక ఆదేశాలు జారీ చేశారు. టీ–హబ్‌ను ప్రభుత్వ ఆఫీసుల కోసం వాడకూడదని ఆయన సీఎస్ రామకృష్ణా రావుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ప్రతిష్టాత్మక స్టార్టప్ ఇంక్యుబేటర్ 'టీ–హబ్' కేవలం న్యూ ఇన్నోవేషన్స్, ప్రత్యేక స్టార్టప్‌లకు కేంద్రంగా మాత్రమే ఉండాలని సీఎస్‌కు దిశానిర్దేశం చేశారు. టీ–హబ్ అనేది ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన స్టార్టప్ హబ్ అని, ప్రభుత్వ కార్యాలయాల తరలింపు వల్ల దాని ప్రాధాన్యత, పనితీరు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఆ ప్రాంగణం పూర్తిగా వారి కార్యకలాపాలకే కేటాయించాలని చెప్పినట్లుగా తెలుస్తోంది.

మరోవైపు రాష్ట్రంలో స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.1000 కోట్ల స్టార్టప్ ఫండ్‌ను ప్రకటించింది. 2034 నాటికి హైదరాబాద్ నుంచి కనీసం 100 యూనికార్న్ కంపెనీలు రావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోంది.

# నిజామాబాద్‌లో గంజాయి ముఠా బరితెగింపు.. మహిళా కానిస్టేబుల్‌పై ఘాతుకం

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠా సభ్యులు రెచ్చిపోయారు. అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నిందితులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళా కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి హతమార్చే ప్రయత్నం చేశారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం సృష్టించింది. నిర్మల్ జిల్లాకు చెందిన ఒక ముఠా కారులో భారీగా గంజాయిని తరలిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిజామాబాద్ శివారులోని మాధవనగర్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి 8 గంటల నిఘా పెట్టారు. పక్కా సమాచారం ప్రకారం అనుమానాస్పదంగా వస్తున్న కారును గుర్తించి, వారిని అడ్డుకునేందుకు మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ముందుకు వెళ్లారు.

మహిళా కానిస్టేబుల్‌పై ఘాతుకం.. పోలీసులను చూసి భయపడిన నిందితులు తప్పించుకోవాలనే ఉద్దేశంతో కారును వేగంగా ముందుకు అలానే పోనిచ్చారు. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న సౌమ్యను కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న ఆమెను తోటి సిబ్బంది వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన తర్వాత పారిపోయేందుకు ప్రయత్నించిన ఇద్దరు ముఠా సభ్యులు మహమ్మద్ సొఫియొద్దీన్, సయ్యద్ షోయల్ పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా అందులో భారీగా గంజాయి లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల వెనుక ఉన్న ఇతర నెట్‌వర్క్ గురించి ఆరా తీస్తున్నారు.

# రాక్షస తండ్రి.. హోమ్ వర్క్ సరిగ్గా రాయలేదని కూతురిపై దారుణం

న్యూస్ డెస్క్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): కూతురు హోమ్ వర్క్ సరిగ్గా చేయలేదని తీవ్రంగా కొట్టి చంపాడు ఓ రాక్షస తండ్రి. కంటికి రెప్పలా, ఆమెకు తోడుగా నిలబడాల్సిన తండ్రే కాలయముడయ్యాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్ లోని ఫరీదాబాద్ లో జరిగింది. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోన్ భద్ర జిల్లాలోని ఖేరాటియా గ్రామానికి చెందిన జైస్వాల్.. తన కుటుంబంతో ఫరీదాబాద్ లోని అద్దె ఇంటిలో ఉంటున్నాడు. జైస్వాల్, అతని భార్య ఇద్దరూ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. తల్లికి పగలు డ్యూటీ, తండ్రికి నైట్ డ్యూటీ. దీంతో పిల్లల్ని జైస్వాలే చూసుకునేవాడు.

తన నాలుగేళ్ల కుమార్తెతో స్కూల్ నుంచి వచ్చాక హోమ్ వర్క్ చేయించేవాడు. ఈ క్రమంలో జనవరి 21న జైస్వాల్ తన కూతుర్ని 1 నుంచి 50 వరకూ అంకెలు రాయమని చెప్పాడు. వాటిని క్రమంలో రాయలేకపోవడంతో ఆమెపై కోపడ్డాడు. తీవ్రంగా కొట్టడంతో స్పృహ కోల్పోయింది. సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికొచ్చిన తల్లి.. కూతురు ఉలుకు పలుకు లేకుండా పడి ఉండటంతో కంగారుపడింది. ఎంత లేపినా లేవకపోవడంతో చనిపోయిందని గ్రహించింది. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చింది. వారింటికి చేరుకున్న పోలీసులు చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. పోస్టుమార్టం పూర్తయ్యాక చిన్నారి మృతదేహాన్ని ఆ కుటుంబానికి అప్పగించినట్లు పోలీసులు




వెల్లడించారు. తండ్రిపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు.

## స్టేషన్ ఘనపూర్‌లో సీనియర్ సిటిజన్ల కోసం లీగల్ సర్వీసెస్ సెంటర్ ప్రారంభం



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో సీనియర్ సిటిజన్ల సంక్షేమం మరియు న్యాయ సహాయం అందించేందుకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీసెస్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఘనపూర్ ఆర్డీవో డి.ఎస్.వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్డీవో వెంకన్న మాట్లాడుతూ..వృద్ధులకు సంబంధించిన సంక్షేమ పథకాలు,ఆస్తి వివాదాలు,కుటుంబ సమస్యలు,పెన్షన్ తదితర న్యాయ సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.అవసరమైన సీనియర్ సిటిజన్లు ఎలాంటి సంకోచం లేకుండా ఈ కేంద్రాన్ని సంప్రదించి ఉచిత న్యాయ సలహాలు,సహాయం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు కూడా పాల్గొని,వృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.లీగల్ సర్వీసెస్ సెంటర్ ద్వారా న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు.కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధులు,న్యాయవాదులు,అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీ ప్రజల దాహార్తిని తీర్చిన ఎండి కరీం

### మంచి చేయడానికి మతంకులం అడ్డు కాదని నిరూపించిన సేవాభావి నాయకుడు



తెలుగు గళం న్యూస్ జాఫర్‌గడ్: "మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మన ఊరు మనకు కన్నతల్లి లాంటిదే. మన ఊరుకు ఏ కష్టం వచ్చినా నేను ముందుంటా" అని మరోసారి నిరూపించారు సేవాభావి నాయకుడు ఎండి కరీం.ఇటీవల హైదరాబాద్ వెళ్లిన సందర్భంగా కరీం అన్నను కలిసిన జాఫర్‌గడ్ వడ్డెగూడెం 12వ వార్డు వాసులు, గత సంవత్సరం కాలంగా సరైన తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎండి కరీం అన్న తన సొంత ఖర్చుతో సుమారు రూ.30 వేల వ్యయంతో పైపు లైన్ తవ్వించి కొత్త పైపు లైన్ ఏర్పాటు చేయించి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. దీంతో ఎస్సీ కాలనీ ప్రజల దాహార్తి తీరింది.అలాగే జాఫర్‌గడ్ చిన్న బడిలో వాటర్ మోటార్ దొంగలు ఎత్తుకుపోయిన కారణంగా నీళ్లు రాక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కరీం అన్న, తన సొంత డబ్బులతో వెంటనే కొత్త మోటార్ కొనుగోలు చేసి అమర్చించారు. దీంతో పాఠశాల విద్యార్థులకు మళ్లీ నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.మాట ఇవ్వడం కాదు–ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే గొప్పతనం అనే మాటకు అర్థం ఎండి కరీం అన్న అని స్థానికులు కొనియాడుతున్నారు.ఊర్లో ఏ సమస్య వచ్చినా ముందుండి తన సొంత ఖర్చులతో పరిష్కారం చూపుతున్న కరీం అన్న సేవలను జాఫర్‌గడ్, ఎస్సీ కాలనీ 12వ వార్డు ప్రజలు హృదయపూర్వకంగా అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛ అన్నారుగూడెంగా గుర్తింపే లక్ష్యం

### సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ వెల్లడి

#### ప్రతి రోజు ఏదో ఒక వార్డులో పనులను స్వయంగా పరిశీలన



తల్లాడ జనవరి 24 గళం న్యూస్: తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ ప్రతిరోజు ఏదో ఒక వార్డులో స్వయంగా పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయా వార్డుల్లో సమస్యలను స్వయంగా ఆయనే అడిగి తెలుసుకుంటూ మరుసటి రోజు అవార్డుల్లోనే సిబ్బందితో కలిసి తిరుగుతూ సైడ్ డ్రైనేజ్ తీపిస్తూ,రోడ్లను శుభ్రం చేయిస్తూ,వృధాగా రోడ్లపై నిలిచిన నీటిని తొలగిస్తూ,వీధుల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే శనివారం బీసీ కాలనీలో విద్యుత్ వైర్లను సరి చేయించి వీధిలైట్లను ఏర్పాటు చేశారు.ఏ వీధిలో కూడా విద్యుత్ సరఫరా లోపం,అపరిశుభ్రత లోపాలు కనిపించకూడదని ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి ఆయన నిర్దేశించారు. అందరి సహకారంతో గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు,పల్లె దవాఖాన డాక్టర్,పంచాయతీ గుమస్తా రమేష్,విద్యుత్ సిబ్బంది,మల్టీపర్పస్ వర్కర్లు,సంబంధిత ప్రాంత అంగన్వాడీ టీచర్,ఆశా కార్యకర్తలు,వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

## పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి-రాపర్తి రాజు

### ఫిబ్రవరి 12న జరగనున్న జాతీయ సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొంటారని సమ్మె నోటీసులు అధికారులకు అందజేత





తెలుగు గళం న్యూస్ జనగామ: రాష్ట్రంలోని గ్రామపంచాయతీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలకు వెంటనే బడ్జెట్ కేటాయించి, గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపర్తి రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జరగనున్న జాతీయ సమ్మెకు సంబంధించి కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, డిపిఓ నవీన్ కుమార్‌లకు సమ్మె నోటీసులు అందజేశారు.అనంతరం రాపర్తి రాజు మాట్లాడుతూ..గ్రామపంచాయతీ సిబ్బందిని కూడా 2వ పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని, జీఓ నెం.51ను సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత కేటగిరీలన్నింటినీ కొనసాగించాలని డిమాండ్ చేశారు.కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించి అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు.పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేసి వేతనాలు చెల్లించాలని, పంచాయతీల అవసరాల ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని సూచించారు.కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, అనారోగ్యంతో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, దహన సంస్కారాలకు ఇప్పుడిస్తున్న రూ.10,000కు బదులుగా రూ.20,000 ఇవ్వాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ జాతీయ సమ్మెలో గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జీపి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వరామచంద్రం, జిల్లా నాయకులు సంగి కర్ణాకర్, మహేందర్, వి. సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

## కర్పూరి ఠాగూర్ ఆదర్శాలు దేశ యువతకు మార్గదర్శకం

### -గుంజపడుగు హరిప్రసాద్



తెలుగు గళం న్యూస్ కరీంనగర్: దేశ యువతకు బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బీసీ ఉద్యమ నాయకుడు, భారతరత్న కర్పూరి ఠాగూర్ ఆదర్శమని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. కర్పూరి ఠాగూర్ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా జాగృతి కార్యాలయంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ సాధారణ నాయీబ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన కర్పూరి ఠాగూర్ కష్టపడి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని, బడుగుజీవుల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి విశేషంగా కృషి చేశారని తెలిపారు.స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే తన దార్శనిక ఆలోచనలతో ఓబీసీల హక్కుల సాధనకు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత నాయకుడని కొనియాడారు.దేశంలో బీసీలకు తొలిసారిగా రిజర్వేషన్లు అమలు చేసిన ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ అని, బీసీలకు 27 శాతం రిజర్వేషన్ రావడానికి ఆయనే మార్గదర్శకుడని పేర్కొన్నారు. మండల్ కమిషన్ అమలుకు కృషి చేసి దేశవ్యాప్తంగా బీసీ సామాజిక ఉద్యమానికి బీజం వేశారని అన్నారు.భూస్వామ్యం, ధనస్వామ్యం, ఫ్యూడల్ వ్యవస్థ రాజ్యమేలుతున్న కాలంలో నిరాడంబర జీవితం గడుపుతూ..సత్యాగ్రహిగా ఆత్మస్థైర్యంతో నిలబడి గెలిచిన వ్యక్తి కర్పూరి ఠాగూర్ అని తెలిపారు.రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా చిన్న ఇంటిలోనే నివసిస్తూ ప్రజల మధ్యే జీవించారని గుర్తు చేశారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించినందుకు అప్పటి కాంగ్రెస్ జాతీయ నాయకత్వం రాజకీయ సంక్షోభం సృష్టించి ఆయనను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించిందని, అయినప్పటికీ బీసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటమే ఈరోజు అమలవుతున్న రిజర్వేషన్లకు పునాది అయిందని అన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు బుడిగె పర్శారం గౌడ్, గాలిపల్లి రత్నాకర్ చారి, బసవేణి రాజేందర్, గుంజపడుగు పవన్ కుమార్, గర్శకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అదిరే కలెక్షన్స్..ఆకట్టుకునే వెరైటీస్

**అట్టహాసంగా పిఎంజె గోల్డ్ అండ్ డైమండ్స్ ఎగ్జిబిషన్**
**ప్రారంభమైన రెండు రోజుల ప్రత్యేక అమ్మకాలు**
**5వేల నుంచి 20లక్షల వరకు అందుబాటులో ఆభరణాలు**
**సొంత తయారీతో కొత్తగూడెం మగువలు మెచ్చేలా డిజైన్స్..**
**ప్రారంభించిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు దారా రమేష్**



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, జనవరి24(తెలుగు గళం న్యూస్): బంగారం అంటే ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి..!! బంగారు నగలుతో అలంకరించుకోవాలని ప్రతి ఆడవారికీ ఉంటుంది..!! అలాంటి వారి కోరికను నెరవేర్చేందుకు అదిరే కలెక్షన్స్.. ఆకట్టుకునే వెరైటీస్‌తో పిఎంజె గోల్డ్ అండ్ డైమండ్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి కొత్తగూడెం ప్రాంత ప్రజల మనసు దోచేస్తోంది. 5 వేల నుంచి 20లక్షల వరకు బంగారు ఆభరణాలను అందుబాటులో ఉంచి ఔరా అనిపించింది.!! 60 ఏండ్లుగా కస్టమర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ లక్షలాది మంది అభిమానులను సొంతం చేసుకున్న ప్రముఖ జ్యూయలరీ సంస్థ పిఎంజె గోల్డ్ అండ్ డైమండ్స్ ఎగ్జిబిషన్ కొత్తగూడెం పట్టణంలో ఏర్పాటు చేయడం పట్ల పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని చుంచుపల్లి పరిధిలోని కమ్మ సత్రం నందు పిఎంజె గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రదర్శన, అమ్మకాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను నమ్మకంతో అందించే సంస్థలే మార్కెట్‌లో నిలదొక్కుకుంటాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పిఎంజె ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, తెలంగాణ సేల్స్ హెడ్ మధవ్‌తో పాటు సంస్థ యాజమాన్యం పాల్గొన్నారు. అతి త్వరలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో పిఎంజె జ్యూయలరీ సంస్థను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులకు ప్రత్యేక సేవింగ్స్ ప్లాన్ సదుపాయాన్ని సైతం అందుబాటులోకి తీసుకువస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రత్యేక ప్రదర్శనలో రూ.5,000 నుండి రూ.20 లక్షల వరకు గోల్డ్ అండ్ డైమండ్ ఆభరణాల విస్తృత కలెక్షన్లు ప్రదర్శించగా, రాబోయే పెళ్లిళ్ల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన వెడ్డింగ్ కలెక్షన్లు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చిన్న ఉంగరం నుంచి పెద్దవారు ధరించే సంప్రదాయ బంగారు నగల వరకు అన్ని రకాల డిజైన్లు అందుబాటులో ఉంచారు. అలాగే డైమండ్ జ్యూయలరీ విభాగంలో ముక్కుపుడక నుంచి వడ్డాణం వరకు ఆధునిక, సంప్రదాయ శైలిల్లో ప్రత్యేక కలెక్షన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రదర్శన నేటితో ముగియనున్నది. ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ, మాదా శ్రీనివాస్, ముడతనపల్లి శ్రీనివాసరావు, ఏ.వీరస్వామి, పి.గోపీకృష్ణ, పసుమర్తి అనంతం తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ హయాంలోనే స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి

- కడియం శ్రీహరి చేసింది ఏమీ లేదు
- కడియం అంటే కమిట్మెంట్ కాదు-పార్టీ మార్పులే కడియం మార్క్
- మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ 18కి 18 సీట్లు గెలవాలి
- సీఎం రేవంత్ రెడ్డి, కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేసిన ఎర్రబెల్లి దయాకర్ రావు



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ జనవరి 24: స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్ కార్యకర్తల సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు.మండలంలోని పద్మావతి గార్డెన్‌లో మాజీ ఎంపీటీసీ గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని, పింఛన్లు రూ.4000 ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు పూర్తిగా నిలిచిపోయాయని విమర్శించారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఈ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

అదేవిధంగా కడియం శ్రీహరిపై కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకే వెళ్లే నేతగా కడియం శ్రీహరి మారిపోయారని, స్వార్థ రాజకీయాల కోసమే పార్టీలు మారే నాయకుడిగా ప్రజలు గుర్తించాలన్నారు. స్టేషన్ ఘనపూర్‌కు డిగ్రీ కళాశాల, 100 పడకల ఆసుపత్రి రాకుండా కేసీఆర్, కేటీఆర్‌ల వద్ద అడ్డుపడ్డారని ఆరోపించారు. "అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకునే కడియం శ్రీహరి ఇప్పటివరకు స్టేషన్ ఘనపూర్‌కు చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలి" అంటూ సవాల్ విసిరారు.

స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీగా చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, డిగ్రీ కళాశాల మంజూరు, పట్టణాభివృద్ధి పనులన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలిపారు. వృద్ధులు, వితంతువులకు పింఛన్లు రూ.200 నుంచి రూ.2000 వరకు ఒకేసారి పెంచిన ఘనత బిఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి, ఉప్పుగల్లు డబుల్ రోడ్ వంటి కీలక అభివృద్ధి పనులు తమ ప్రభుత్వంలోనే పూర్తయ్యాయని గుర్తు చేశారు.అనంతరం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.బిఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ గెలిచినట్టేనని అన్నారు. మున్సిపాలిటీ చైర్మన్‌గా బిఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే 2000 కుట్టు మిషన్లు అందిస్తామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ 18కి 18 స్థానాలు గెలవాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో అధికారంలో ఉన్నా సరైన అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కడియం శ్రీహరి విద్యాశాఖ, ఇరిగేషన్ మంత్రిగా ఉన్నా ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా తీసుకురాలేకపోయాడన్నారు.మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ..కేసీఆర్ రైతు బంధు, రైతు బీమా, కంటి వెలుగు, కళ్యాణలక్ష్మి, పింఛన్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి ఎక్కడుందో చూపించాలని మరోసారి సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర వికలాంగుల చైర్మన్ వాసుదేవారెడ్డి, చేవెల్ల సంపత్, ఆకుల కుమార్, నరసింహరెడ్డి, బాల్ రాజు, కీర్తి వెంకటేశ్వర్లు, మనోజ్ రెడ్డి, జనగాం యాదగిరి, కర్ర సోమిరెడ్డి, బంగ్ల శ్రీను, తాటికొండ సురేష్, మహేందర్ రెడ్డి, ప్రసాద్, మల్లేష్, అశోక్ తదితర బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నిరుపేద రెడ్డిల సంక్షేమానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి

**ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పెంపు, రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు అవసరం**
**రేగొండలో రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో**
**జిల్లా ఉపాధ్యక్షులు పత్తి బుచ్చిరెడ్డి**



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: నిరుపేద రెడ్డి కుటుంబాలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పత్తి బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు.శనివారం రేగొండ మండల కేంద్రంలో నిర్వహించిన రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ,సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ నిరుపేద రెడ్డి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులోకి రావాలంటే ప్రత్యేక విధానాలు అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈడబ్ల్యూఎస్ (ఆర్థికంగా బలహీన వర్గాలు) కోటాలో రిజర్వేషన్‌ను 15 శాతానికి పెంచాలని,అలాగే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఒకసారి తీసుకుంటే ఐదేళ్లపాటు చెల్లుబాటు అయ్యేలా నిబంధనల్లో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే రెడ్డి సామాజిక వర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5,000 కోట్ల నిధులు మంజూరు చేయాలని,నిరుపేద రెడ్డి విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలను పెంపొందించేందుకు విదేశీ విద్య కోసం రూ.20 లక్షల స్కాలర్షిప్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ చర్యల ద్వారా నిరుపేద కుటుంబాల భవిష్యత్తు మరింత భద్రమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రేగొండ రెడ్డి సంఘం టౌన్ అధ్యక్షులు గోగుల చంద్రకర్ రెడ్డి, మాజీ పి ఎ సి ఎస్ వైస్ చైర్మన్ సామల పాపి రెడ్డి, రెడ్డి సంఘం యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సుమన్ రెడ్డి, గన్ రెడ్డి మనోహర్ రెడ్డి,గోగుల అశోక్ రెడ్డి,బండ బుచ్చిరెడ్డి,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,గోగుల మోహన్ రెడ్డి, మూలగుల్ల విజేందర్ రెడ్డి,ఏనుగు లింగారెడ్డి,సామల రాజి రెడ్డి, నర్రా విజేందర్ రెడ్డి, రచన తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సత్తుపల్లి మైనారిటీగురుకులంలో అడ్మిషన్లు ప్రారంభించిన ఎమ్మెల్యే మట్టా దంపతులు

- అడ్మీషన్ పోస్టర్ ఆవిష్కరణ
- పాల్గొన్న విశిష్ట అతిథి అరుణ కుమారి




సత్తుపల్లి,ఆర్ సి,జనవరి24(తెలుగుగళం) న్యూస్:సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడు రోడ్లో గల తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనది. అడ్మిషన్లు 2026- 27 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ మరియు బైపీసీ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ఆన్లైన్ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులుహాజరైనారు.కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మరియు క్రిస్టియన్ మైనారిటీ పేద వర్గాల వారిని దృష్టిలో ఉంచుకొని వారి అభ్యున్నతి కొరకు మైనారిటీ గురుకులపాఠశాలలనుఅంకితభావంతోనడిపిస్తుంది
అనితెలిపారు.అందుకనిఈసొసైటీలో విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోట్లరూపాయలుఖర్చుచేస్తుందనితెలిపారు.ఈ అవకాశాన్ని మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా ఈ సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నిరంతరసేవప్రశంసనీయమైనదని తెలిపారు.దానికితార్కాణం విద్యార్థుల ప్రతిభే అని దానికి ప్రత్యక్ష ఉదాహరణ మన స్కూల్ మరియు కాలేజీ ప్రిన్సిపాల్ కత్తి వెంకటరామయ్య అని తెలిపి ప్రత్యేకంగా ఆయనను అభినందించారు. అలాగే మన సత్తుపల్లి లో ఉన్న ఈ మైనారిటీ గురుకులంలో ప్రతిపేద మైనారిటీవిద్యార్థులుఅడ్మిషన్లుతీసుకోవాలన్నారు.అలాగే నేటి రోజుల్లో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు ఆకాశం వైపు చూస్తున్నాయనిఅయినాప్రభుత్వం ఎన్నో సౌకర్యాలుకల్పిస్తున్నప్పుడు వాటిని సద్వినియోగంచేసుకోవాలని హితవు పలికారు.అలాగే తాను చదివే రోజుల్లో ఇన్ని సౌకర్యాలు లేవన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించారు.

ఆర్.ఎల్.సి అరుణకుమారి

ఇంకా ఈ కార్యక్రమానికి హాజరైన విశిష్ట అతిథి ఖమ్మం జిల్లా మైనారిటీ విద్యాసంస్థల ప్రాంతీయ సమన్వయ అధికారిణి అరుణకుమారి 2026- 27 అడ్మిషన్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ ఎల్ సి మాట్లాడుతూ దేశంలోనే తలమానికంగా మన గురుకులాలు ఉన్నాయని చరిత్ర తెలుపుతుందని అందుకు ఉదాహరణగా బీహార్ లోని నలంద విశ్వవిద్యాలయం అని, ఎంతో మంది విదేశీయులు అక్కడ చదువుకొని గొప్పవారిగా రాణించారని ఆ స్ఫూర్తితోనే మన రాష్ట్రంలో గురుకులాల వ్యవస్థ ఏర్పాటు చేయబడిందని వాటిని సద్వినియోగ పరుచుకోవాలని ప్రతి ఒక్క పేద ముస్లిం విద్యార్థి చదువుకొని వారి భవిష్యత్తుకు రాచబాట వేసుకోవాలని తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు వసతి భోజనం, పుస్తకాలు, బట్టలు మొదలైన సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తుందని తెలిపారు. తమ విద్యార్థులకు ప్రపంచాన్ని పరిచయం చేసే ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన ఉంటుందని తెలిపారు. అలాగే విద్యార్థుల ప్రగతికి అనునిత్యం కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ కే.వెంకట్రామయ్యని అభినందించారు.

ప్రిన్సిపాల్ కత్తి వెంకటరామయ్య

ఇంకాఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య మాట్లాడుతూ ఇంత బిజీ షెడ్యూల్లో కూడా తమ అభ్యర్థనను మన్నించి కార్యక్రమానికి విచ్చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో దేనిమీదైనా పట్టు సాధించాలంటే అది కేవలం చదువుకోవడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపి, నిరక్షరాస్యుడైన కుచేలుడు ప్రపంచాన్ని చుట్టి రావాలంటే కేవలం చదువుకుంటేనే సాధ్యమవుతుందని తెలిపారు. అందుకని జ్ఞానాన్ని ,తెలివినిమేల్కొల్పేది చదువేననితెలిపారు.అందుకనిమహాకవి కాళోజీ అన్నట్లు ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళ కలయిక అని తెలిపారు అన్నారు.అలాగే ఖమ్మం ఆర్ఎల్ సి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి కె. సీతారాములు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, విఎంసి జి.చెన్నారావు, మైనారిటీ రిలీజియన్ పెద్దలు షేక్ నాయబ్ రసూల్,ఎండి కమల్ పాషా, ఎస్ ఐ ఓ సత్తుపల్లి ముజీబుర్రహ్మాన్, హిందీ పండిట్ కిష్టారం ఎండి రియాజ్,సి సి ఓ లక్మోజీ ఎస్సీఓవై.శేషగిరి ,దొడ్డాకుల గోపాల్ రావు,పువ్వాళ్ళ ఉమా ఇతర ఉపాధ్యాయులు, ఇమాములు, సదర్లు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సండ్ర వెంకట వీరయ్య



తల్లాడ కలం న్యూస్.24.1.2026 ఖమ్మం తెలంగాణ భవన్ లో జరిగిన రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకల్లో ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ తాత మధు గారితో కలిసి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఘనంగా డ్రైవర్స్ డే వేడుకలు




సత్తుపల్లి,ఆర్ సి,జనవరి24 (తెలుగుగళం)న్యూస్:డ్రైవర్స్ డే సందర్భంగా సత్తుపల్లి డిపోలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్లు అప్రమత్తతో వ్యవహరిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు. ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు పూర్తిగా నివారించవచ్చునని ఆయన ఈ సందర్భంగా అన్నారు. సెల్ఫోన్ డ్రైవింగ్ చేయకూడదు అని డ్రైవర్లకు ఈ సందర్భంగా సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని తెలిపారు. ఉదయం 5 గంటల నుండి సత్తుపల్లి డిపోలో ప్రతి ఒక్క డ్రైవర్కు గులాబీ పూలు అందజేసి డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ ఆదాయానికి కృషి చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్.సాహితి ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



# అతిరధ మహారధులతో ఘనంగా తెలుగుగళం కేలండర్ ఆవిష్కరణ“

- సామాన్యుల గుండె చప్పుడు ను ప్రభుత్వాల దృష్టికి తెచ్చే వారధి గళం: ఎమ్మెల్యే(మట్టా రాగమయి దయానంద్)
- జర్నలిజానికి మారుపేరు గళం: కొత్తూరు ఉమామహేశ్వరరావు(మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్)
- అవినీతి అక్రమాలను వెలికి తీసేది తెలుగుగళం:శ్రీహరి(పోలీస్ సీఐ)
- పట్టణ ప్రజల సమస్యలను తెలిపే గళం:నరసింహ(పట్టణ పురపాలక సంఘం కమిషనర్)
- ప్రజలకు అధికారులకు సమన్వయకర్త: తహశీల్దార్ సత్యనారాయణ“
- విజ్ఞానాన్ని విశ్వమానవాళికి అందించేది తెలుగుగళం:కుటుంబరాజు(సబ్ జైలర్)
- నిజానికి నిలువుటద్దం:జొన్నలగడ్డ నాగ శ్రీనివాసరావు(మోటారు వాహనాల తనిఖీ అధికారి)
- ప్రజా సమస్యలపై అధికారులను మేల్కొలిపే పత్రిక:బోయినపల్లి రవి(వకీల్ సాబ్)



సత్తుపల్లి,ఆర్ సి,జనవరి24(తెలుగుగళం) న్యూస్:శనివారం ఖమ్మంజిల్లా సత్తుపల్లి పట్టణంలో అతిరధ మహారధులతో తెలుగుగళం జాతీయ తెలుగు దినపత్రిక ముద్రించిన 2026 నూతన సంవత్సర కేలండర్ ల ఆవిష్కరణ అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా తెలుగుగళం జాతీయ దినపత్రిక ఆర్ సి మల్లూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ స్వగృహం వద్ద రాగమయి చేతులమీదుగా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్యుల గుండె చప్పుడును ప్రభుత్వాల దృష్టికి తెచ్చే వారధిగా తెలుగుగళం పని చేస్తుందని మరింత మున్ముందుకు సాగాలని ఆశిస్తున్నానని స్పష్టం చేశారు.అనంతరం మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు ఆవిష్కరించి మాట్లాడుతూ జర్నలిజానికి మారుపేరుగా తెలుగుగళం జాతీయ దినపత్రిక వాస్తవాలను ప్రతిబింబించేలా వార్తలు ప్రసారం చేస్తూ సమాజ ఎదుగుదలకు దోహద పడుతుందని కొనియాడారు.అనంతరం

పట్టణ పోలీస్ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి చేతులమీదుగా ఆవిష్కరణ జరిగింది.శ్రీహరి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలికి తీసేదిగా తెలుగుగళం పత్రిక పనిచేస్తుందని కొనియాడారు.

అనంతరం పట్టణ పురపాలక సంఘం కమిషనర్ కె. నరసింహ కేలండర్ లను ఆవిష్కరించి మాట్లాడుతూ పట్టణ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలిపి పరిష్కారం చేయడానికి తెలుగుగళం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.అనంతరం మండల తహశీల్దార్ సత్యనారాయణ తన ఛాంబర్ లో కేలండర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కారం కోసం కృషి చేసే సమన్వయకర్తగా గళం వినిపిస్తుందన్నారు.అనంతరం సబ్ జైలు జైలర్ కుటుంబరాజు తన ఛాంబర్ లో కేలండర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ విశ్వ మానవాళికి విజ్ఞానాన్ని అందించేదిగా తెలుగుగళం జాతీయ దినపత్రిక ముందుకు వెళ్తుందని ఇంకా అభివృద్ధి చెందాలని అన్నారు.అనంతరం మోటార్ వాహనాల తనిఖీ అధికారి జొన్నలగడ్డ నాగ శ్రీనివాసరావు కేలండర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ నిజమైన వార్తలకు కేరాఫ్ అడ్రస్ గా తెలుగుగళం జాతీయ దినపత్రిక నిలుస్తుందని,నిజాన్ని నిర్భయంగా చాటే నిలువుటద్దంగా ఉందన్నారు.అనంతరం పట్టణ ప్రముఖ వకీల్ సాబ్ (న్యాయవాది) బోయినపల్లి రవి కేలండర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులను వార్తగా మరల్చి అధికారులను మేల్కొల్పే పత్రికగా గళం పేరు గాంచిందన్నారు.అవినీతి అక్రమాలను నిలదీసే మహాశక్తిగా ఎదగాలని అన్నారు.అందరినీ శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో: తెలుగుగళం జాతీయ దినపత్రిక సత్తుపల్లి మండల రిపోర్టర్ పసుమర్తి నవీన్,సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు,జాతీయవాణి దినపత్రిక ఆర్సీ ఆరెంపుల హరిబాబు,మీ వార్త దినపత్రిక ఆర్సీ జంగం కిరణ్ కుమార్,అక్షిత మీడియా ఆర్సీ మహమ్మద్ అఫ్జల్,తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక రిపోర్టర్ గోదా నాగబాబు,కన్జ్యూమర్ రైట్స్ ఫోరం జిల్లా చైర్మన్, క్రైమ్ ఇండియా టీవీ రిపోర్టర్ కంటే శేఖర్,ఉదయం పత్రిక రిపోర్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఈరోజు ఇప్పుడూ మన తెలుగుగళం జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సర కేలండర్ ను సత్తుపల్లి పోలీస్ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి ఆవిష్కరించారు



సత్తుపల్లి లో సబ్ జైలర్ కుటుంబరాజు గారు చేతులమీదుగా ఆవిష్కరణ



సత్తుపల్లి లో పట్టణ పురపాలక కమిషనర్ నరసింహా ఆవిష్కరించారు



మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు గారు చేతులమీదుగా ఆవిష్కరణ



మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు గారు చేతులమీదుగా ఆవిష్కరణ



సత్తుపల్లి పట్టణంలో ప్రముఖ న్యాయవాది (వకీల్ సాబ్) బోయనపల్లి రవి ఆవిష్కరణ చేశారు



సత్తుపల్లి పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జొన్నలగడ్డ నాగ శ్రీనివాసరావు గారు చేతులమీదుగా ఆవిష్కరణ చేశారు

# వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

## రూ1350 కోట్లతో 10 వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి శంకుస్థాపన

## పామాయిల్ సాగు విస్తరణకు రైతులు ముందుకు రావాలి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: రైతులకు గిట్టుబాటు ధరలు, సరైన నిల్వ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వ్యవసాయ,చేనేత, సహకార, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన మంత్రి మొగుళ్ళపల్లి మండలం పాతఇస్సిపేట గ్రామంలో రూ.13.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మార్కెట్ గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ గోదాం ద్వారా రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని అనుకూల సమయంలో విక్రయించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు,వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు,చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,జిల్లా ఎస్పీ సంకీర్త్ తదితరులు పాల్గొన్నారు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో పామాయిల్ సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. పామాయిల్ పంటకు ప్రభుత్వం టన్నుకు రూ.20 వేల మద్దతు ధరతో కొనుగోలు,ఎకరానికి సంవత్సరానికి రూ.51 వేల సబ్సిడీ అందిస్తోందని తెలిపారు.అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చని సూచించారు. లక్ష్యాలు సాధించడంలో విఫలమయ్యే ప్రైవేట్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాష్ట్రం ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ రైతాంగానికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ,రూ.3 వేల కోట్ల సన్నబియ్యం బోనస్ చెల్లించిందని మంత్రి గుర్తు చేశారు.ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రైతులకు నిల్వ సౌకర్యాల లేమి వల్ల పంటలకు తగిన ధరలు రాక నష్టపోతున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గోదాం నిర్మాణంతో పాటు, మెయిన్ రోడ్ నుంచి గోదాం వరకు రూ.2.50 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం భారత్ ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, వడ్డీలేని రుణాలు, చేనేత రుణమాఫీ ఉత్తర్వులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించామని, మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.25 వేల కోట్ల వడ్డీలేని రుణాలు, చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. సన్నబియ్యం పథకాన్ని రూ.13 వేల కోట్లతో అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించి పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల వివరాలు తెలుసుకుని, పలు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.





# ఉల్లాసభరితంగా రెండో రోజు క్రీడలు

## ప్రారంభించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్



తెలుగు గళం ప్రతినిధి( భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. జనవరి 26) శనివారం నాడు కిన్నెరసాని క్రీడా మైదానంలో గిరిజన సంక్షేమ శాఖ ఐటిడిఎ భద్రాచలం , ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండవ రోజు క్రీడా పోటీలను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ ఘనంగా ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో బిజి బిజి గా ఉంటూ గిరిజన విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం కోసం ఈ క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రీడా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు ఆడిన ఆటలు అందరిని ఆకర్షించాయని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారనేది నేడు జరిగిన ఆటలే నిదర్శనం అని అన్నారు. అందరితో కలిసి ఆటవిడుపుగా సరదాగా ఆడటం మనసుకు చాలా ఉల్లాసం కలిగిందని, ఉద్యోగులు ఉపాధ్యాయులు అందరూ కలిసి వారికి నచ్చిన క్రీడలలో పాల్గొని ప్రతి ఒక్కరు గెలవాలని తపనతోనే ఆడారని అన్నారు. ఏ పి ఓ జనరల్ డేవిడ్ రాజ్,ఐటిడిఏ భద్రాచలం డిప్యూట్ డైరెక్టర్ అశోక్ క్రీడాకారులను ఉత్సాహపరిచారని,మానసిక శారీరక ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు మానసిక ఉల్లాసం కొరకు ఈ క్రీడలు నిర్వహించడం జరిగిందని అన్నారు.ఐటిడిఎ పిఓ గా బాధ్యతలు చేపట్టిన నుండి గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసం మెరుగుపడడానికి ఎన్నో రకాల ప్రణాళికలు తయారుచేసి వారి విద్యాభివృద్ధికి పాటుపడుతున్నానని, జాతీయస్థాయిలో గిరిజన విద్యార్థులు క్రీడలో రాణించడానికి నా వంతు సహకారం అందిస్తున్నానని, ఉద్యోగులను ఉత్సాహపరడం కోసం ఈ క్రీడలు నిర్వహించానని, వారితోపాటు క్రీడలలో పాల్గొనడం వలన నేను చదువుకున్న రోజులు గుర్తుకు వచ్చాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం వలన ఈ క్రీడలు విజయవంతం అయ్యాయని అందుకు సహకరించిన క్రింది స్థాయి సిబ్బందిని మొదలుకొని పై స్థాయి వరకు అందరికీ అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు.

వివిధ క్రీడలలో గెలుపొందిన పురుషులు, మహిళలు వాలీబాల్ లో పురుషులలో మొదటి బహుమతి, టీం-బి భద్రాచలం టీం సి ద్వితీయ బహుమతి.

మహిళలో ప్రథమ బహుమతి దమ్ముపేట బి టీం, ద్వితీయ బహుమతి ఏ-టీం.

టెన్నికాయిట్ లో ప్రథమ బహుమతి భద్రాచలం బీ టీం పురుషులు, ద్వితీయ బహుమతి ఖమ్మం బి టీం,

50మీ.. రన్ పురుషులు మొదటి స్థానం దశరథ్, రెండవ బి సేన ఖమ్మం, 3వ స్థానం, రాకేష్ సాధించారు.

ఈ కార్యక్రమంలో , ఖమ్మం డిడి విజయలక్ష్మి, భద్రాద్రి మరియు ఖమ్మం ఏసిఎంఓ లు రాములు, కె.రమేష్, దమ్మపేట ఏటీడీవో చంద్ర మోహన్,ఇల్లందు భారతి దేవి, వైరా పి రమేష్,ఖమ్మం సత్యవతి, స్పోర్ట్స్ ఆఫీసర్ బొల్లి గోపాలరావు, మరియు సహచర ఏ ఎస్ ఓ లు కె.వెంకట్ నారాయణ, ఎస్ నాగేశ్వరరావు

పి జి హెచ్ ఎం లు, ఉపాధ్యాయులు, పిడి, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.








# తల్లాడ ఎంపీడీవోగా ఏ శ్రీధర్ రాజు బాధ్యతలు స్వీకరణ

## అందరి సహకారంతో అభివృద్ధికై సహకరిస్తా...



తల్లాడ జనవరి 24, గళం న్యూస్ ...తల్లాడ మండల నూతన ఎంపీడీవో గా ఏ శ్రీధర్ రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు,ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది సహకారంతో మండలాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తానని. అందుకు నా శాయశక్తుల కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.ఈ సందర్భంగా మండల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకునేందుకు ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, అధికారులతో పని చేయించుకోవడం తమ హక్కుగా భావించాలని .ఈ సందర్భంగా ఆయన ప్రజలకు సూచించారు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలి



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, ఆధ్వర్యంలో ఈరోజు గుండెపుడి గ్రామసభ లో సర్పంచ్ కి వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం గ్రామ కార్యదర్శి బోడపట్ల రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, 2005 సంవత్సరంలో గ్రామీణ పేదలకు పని లేని రోజుల్లో 100 రోజుల పని కల్పించుటకు ఆనాడు యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని తీసుకొచ్చింది ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయుటకు 2025 శీతాకాల పార్లమెంట్ సమావేశంలో ఈ చట్టాన్ని రద్దుచేసి దీని స్థానే వికసితు భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిత మిషన్ గ్రామీణ ( జి రాంజీ) నూతన స్కీమును తీసుకొచ్చింది దీనివల్ల గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం కలుగుతుంది దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని మన గ్రామ పంచాయతీ ద్వారా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేస్తున్నాము

డిమాండ్స్

1; నూతనంగా తీసుకొచ్చిన జిరాంజీ స్కీమును వెంటనే ఉపసంహరించుకోవాలి

2; 2005 మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలి

3; పని దినాలు వంద రోజుల నుండి 200 వరకు పెంచి రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలి

4; కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో ఉపాధి హామీకి రెండున్నర లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలి

5; పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలి అన్నారు,

ఈ కార్యక్రమంలో కందల రమేష్,బయ్య సురేష్,షేక్ షరీఫ్,గంధసిరి మహేష్, తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే గండ్ర సత్తన్నపై మంత్రి తుమ్మల ప్రశంసల జల్లు

### ప్రజల మధ్యే ఉంటూ అభివృద్ధిని ముందుకు నడిపిస్తున్న నాయకుడు

### పాతఇస్సీపేట వేదికగా ఎమ్మెల్యే పనితీరును కొనియాడిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్లపల్లి: భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రజలతో నిత్యం మమేకమై, గ్రామగ్రామాన అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (సత్తన్న) పనితీరును రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగంగా ప్రశంసించారు.మొగుళ్ళపల్లి మండలం పాతఇస్సీపేట గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి,ఎమ్మెల్యే గండ్రను అభినందనలతో ముంచెత్తారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ,భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్తన్న తనను ఒక్క గోడౌన్ శంకుస్థాపనకు పిలిచి పరిమితం కాలేదని,నియోజకవర్గానికి అవసరమైన మరిన్ని గోడౌన్‌లు, సహకార సంఘాలు (సొసైటీలు), మౌలిక వసతుల అభివృద్ధి పనులు కావాలని స్పష్టంగా కోరారని తెలిపారు. ప్రజల అవసరాలను ముందుగానే అంచనా వేసి, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, నిధులు తీసుకురావడంలో గండ్ర సత్తన్న ముందుంటారని కొనియాడారు.భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రతీ గ్రామాన్ని, ప్రతీ గడపను చేరిన రాష్ట్రంలోనే అరుదైన ఎమ్మెల్యే గండ్ర సత్తన్న అని పేర్కొన్న మంత్రి, తాను ఆయనను పరిచయం అయినప్పటి నుంచి నిరంతరం గమనిస్తున్నానని తెలిపారు. ఎన్నికల కాలంలో మాత్రమే కాదు, ఎన్నికలు లేని సమయంలో కూడా ప్రజల్లో ఉంటూ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసే నాయకుడు గండ్ర సత్తన్న అని అన్నారు.మంత్రి తుమ్మల ఇంకా మాట్లాడుతూ,"రాజకీయాలు అంటే పదవులు, అధికారం కాదు. ప్రజల కోసం కష్టపడి పనిచేయాలనే నిజమైన తపన ఉండాలి. ఆ తపన, నిక్కచ్చితనం గండ్ర సత్తన్నలో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా ప్రతినిధిగా ఉండాల్సిన లక్షణాలన్నీ ఆయనలో ఉన్నాయి" అంటూ ఎమ్మెల్యే గండ్రను ప్రశంసించారు.అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలో జరిగిన గ్రామసభలు, పాదయాత్రలు, బస్తీ బాటలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి అంశాల్లో గండ్ర సత్తన్న పాత్ర కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేరువయ్యేలా చేసిన నాయకుల్లో గండ్ర సత్తన్న ముందువరుసలో ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి స్థాయి నాయకుడు బహిరంగంగా ఎమ్మెల్యే పనితీరును ప్రశంసించడం భూపాలపల్లి రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారి తీసింది.

# నరేగా హక్కులను కాపాడేందుకే కాంగ్రెస్ పోరాటం

### కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీరామ్ జీ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించాలి

### నరేగా బచావోసంగ్రామ్ గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (నరేగా) రద్దు చేసి, దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీరామ్ జీ అనే కొత్త చట్టం గ్రామీణ పేదల ఉపాధి హక్కులను హరిస్తోందని, దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామంలో నిర్వహించిన "నరేగా బచావో సంగ్రామ్" గ్రామసభ మరియు నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నరేగా పథకం గ్రామీణ ప్రజలకు జీవనాధారంగా నిలిచిందని, కోట్లాది మంది కూలీలు ఈ



చట్టం ద్వారా ఉపాధి పొందుతున్నారని అన్నారు. అలాంటి చట్టాన్ని రద్దు చేసి, కార్పొరేట్ వర్గాలకు మేలు చేసే విధంగా కొత్త చట్టాన్ని తీసుకురావడం ప్రజా వ్యతిరేక చర్య అని విమర్శించారు. గ్రామీణ పేదల హక్కులను హరించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, అవసరమైతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ,నరేగా చట్టం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన చట్టమని తెలిపారు. ఈ చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిల్లోనిపల్లి (పుల్లూరి రామయ్యపల్లి) గ్రామంలో నూతనంగా నిర్మించనున్న బీరప్ప దేవాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు.

# తెలుగు గళం దినపత్రిక' క్యాలెండర్

## ఆవిష్కరించిన గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: తెలుగు గళం దినపత్రిక 2026 సంవత్సర క్యాలెండర్ ను శనివారం మహబూబాబాద్ జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు అవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ రావు మాట్లాడుతూ.. గొప్ప అవిష్కరణల ద్వారా గొప్ప గొప్ప ఫలితాలు పొందగలుగుతారని తెలియచేసారు, వినూత్నమైన అవిష్కరణలు ద్వారా పొందిన మంచి ఫలితాలను సాధారణ ప్రజలకు సైతం అందుబాటులో వుండే విదంగా వున్నప్పుడే వాటికీ ఒక అర్థం, పరమార్థం ఉంటుందని అలాంటి వినూత్నమైన అవిష్కరణ యొక్క ఫలితం సార్థకం అవుతుందని తెలియాచేసారు. అదేక్రమంలో తెలుగు గళం దినపత్రిక ప్రజా సమస్యలపై మరిన్ని వార్త కథనాలు రాసి ప్రభుత్వాలకు ప్రజలకు వారదిగా ఉండాలని తద్వారా సమాజానికి మేలు జరిగేవిదంగా వార్తలను అందిస్తూ ముందుకు సాగాలని సూచన చేశారు, నవీన్ రావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం ఎంతో ఆనందకరంగా ఉందని తెలుగు గళం దినపత్రిక యాజమాన్యం సంతోషంన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బిఆర్ స్ నాయకులు గంట్ల మహిపాల్ రెడ్డి,పేపర్ శ్రీను,బోడ భాస్కర్, లునవత్ వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

# టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ అవుట్.. స్కాట్లాండ్ ఇన్..




స్పోర్ట్స్ న్యూస్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): టీ20 వరల్డ్ కప్ నుంచి బంగ్లాదేశ్ అధికారికంగా బయటకు వెళ్లింది. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను అధికారికంగా నియమించినట్లు ఐసీసీ శుక్రవారమే ప్రకటించింది. భద్రతా కారణాలను పేర్కొంటూ భారత్‌లో ఆడమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్(బీసీబీ) నిర్ణయించుకుంది. తమ వేదికను శ్రీలంకకు మార్చాలని డిమాండ్ చేసింది. అయితే, దీనికి ఐసీసీ ఒప్పుకోలేదు. శనివారం రోజు ఐసీసీ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు ఒక లేఖ రాసి, మీ స్థానంలో స్కాట్లాండ్‌ను తీసుకున్నట్లు తెలియజేసిందని నివేదికలు చెబుతున్నాయి.

బంగ్లాదేశ్ వివాదం, టోర్నమెంట్‌పై నిర్ణయం తీసుకోవడానికి ఐసీసీ చైర్మన్ జై షా అధ్యక్షతన శుక్రవారం దుబాయ్‌లో కీలక సమావేశం జరిగింది. దీనికి ముందు, చివరి ప్రయత్నంగా తమ సమస్యను డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీకి పంపాలని ఐసీసీని కోరింది. అయితే, కమిటీ అప్పీల్ అధికారాలు లేవని, ఐసీసీ తుది నిర్ణయంతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఐసీసీ ఇచ్చిన గడువులోగా బంగ్లాదేశ్ స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో, ఆ జట్టును టోర్నీ నుంచి తొలగించి స్కాట్లాండ్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

అనూహ్యంగా స్కాట్లాండ్‌కు ఈ అవకాశం వచ్చింది. స్కాట్లాండ్ 5 టీ20 వరల్డ్ కప్‌లలో పాల్గొంది. 2022, 2024 ఎడిషన్లలో ఆడింది. అయితే, సూపర్ -8కు చేరుకోకపోయినా, బలమైన జట్లకు గట్టి పోటీని ఇచ్చింది. 2024 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లను దాదాపుగా ఓడించే ప్రయత్నం చేసింది. యూరోపియన్ క్వాలిఫయర్స్‌లో ఇటలీ, నెదర్లాండ్స్ కన్నా వెనకబడినప్పటికీ, ఐసీసీ ర్యాకింగ్స్ ఆధారంగా స్కాట్లాండ్ ఎంపిక జరిగింది. ప్రస్తుతం, బంగ్లాదేశ్ దాదాపుగా బయటకు పోవడంతో గ్రూప్-సీలో స్కాట్లాండ్, నేపాల్, వెస్టిండీస్, ఇటలీ జట్లు ఉంటాయి.

# 3 ఓవర్లు 67 పరుగులు..న్యూజిలాండ్ బౌలర్ చెత్త రికార్డ్



స్పోర్ట్స్ న్యూస్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): భారత్, న్యూజిలాండ్ మధ్య రాయ్ పూర్ వేదికగా జరిగిన రెండవ వన్డేలో కీలక పరిణామం చోటు చేసుకుంది. న్యూజిలాండ్ బౌలర్ జకారీ ఫౌల్క్స్ చెత్త రికార్డు నమోదు చేసుకున్నాడు. ఈ మ్యాచ్ లో కేవలం 3 ఓవర్లు వేసిన జకారీ ఫౌల్క్స్ ఏకంగా 67 పరుగులు సమర్పించుకున్నాడు. ఇందులో ఒక నోబాల్ తో పాటు 5 వైడ్స్ ఉన్నాయి. 22.30 ఎకనామితో బౌలింగ్ చేశాడు. ఈ జకారీ ఫౌల్క్స్ బౌలింగ్ లో సూర్య కుమార్ యాదవ్ చితక బాదాడు. ఈ నేపథ్యంలోనే 67 పరుగులు సమర్పించుకున్నాడు జకారీ ఫౌల్క్స్.

వాస్తవంగా అతడు బాగానే బౌలింగ్ చేశాడు, కానీ పొగ మంచు ఎక్కువ కావడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎంత టెక్నిక్ గా బౌలింగ్ చేసినప్పటికీ బంతి నేరుగా బ్యాట్ పైకి వెళ్లడం గమనించవచ్చు. ఈ తరుణంలోనే 208 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.2 ఓవర్లలోనే ఇండియా ఛేదించింది. ఈ మ్యాచ్ లో భారత జట్టు కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ 82 పరుగులు సాధించగా ఇశాన్ కిషన్ 76 పరుగులతో రాణించాడు. చివరలో ఆల్రౌండర్ శివమ్ దూబె 36 పరుగులతో జట్టును ఆదుకున్నాడు.

# పాకిస్తాన్ రికార్డును బద్దలు కొట్టిన భారత్.. మరో 28 బంతులు మిగిలి ఉండగానే!



స్పోర్ట్స్ న్యూస్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్‌పై ఏడు వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించింది. అయితే, ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ కేవలం 15.2 ఓవర్లలోనే 209 పరుగుల భారీ లక్ష్యాన్ని ఈజీగా ఛేధించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇక, జాతీయ జట్టుకు రెండేళ్లకు పైగా విరామం తర్వాత తుది టీంలోకి వచ్చిన ఇషాన్ కిషన్ తన రీఎంట్రీని అద్భుతంగా ఉపయోగించుకున్నాడు. కేవలం 32 బంతుల్లో 76 పరుగులు చేయగా.. అందులో 11 ఫోర్లు, 4 సిక్సులతో న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇక, తొలి బంతి నుంచే దూకుడుగా ఆడిన కిషన్, పుల్ షాట్లు, పిక్-అప్ షాట్లు, రివర్స్ స్వీప్‌లతో స్టేడియంలోని ఫ్యాన్స్ ను ఉర్రూతలూగించాడు.

ఇక, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 23 ఇన్నింగ్స్‌ల తర్వాత తన తొలి హాఫ్ సెంచరీ సాధించాడు. 37 బంతుల్లో 82 పరుగులు (నాటౌట్) చేసి అసాధారణ ఇన్నింగ్స్ ఆడాడు. అతడితో పాటు శివమ్ దూబే కూడా 18 బంతుల్లో 36 రన్స్ చేసి అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. వీరి భాగస్వామ్యం మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపుకు తిప్పేసింది. చేజింగ్ ప్రారంభంలో భారత్‌కు షాక్‌లు తగిలాయి. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ రెండో ఓవర్‌కే ఔట్ కావడంతో టీమిండియాపై ఒత్తిడి పెరిగింది. అయితే, ఆ తర్వాత ఇషన్ కిషన్ చేసిన కౌంటర్ అటాక్‌తో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. ఇషన్ ఈ ప్రదర్శన సంజూ శాంసన్ స్థానంపై మరింత ఒత్తిడిని తెచ్చే అవకాశం ఉంది. ఫిట్‌నెస్ సాధించిన తర్వాత తిలక్ వర్మ తిరిగి జట్టులోకి వస్తే 3వ నంబర్ స్థానంలో బ్యాటింగ్ కోసం పోటీ మరింత పెరగనుంది.

అయితే, న్యూజిలాండ్‌పై ఈ ఘన విజయంతో భారత్ క్రికెట్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచింది. పాకిస్తాన్ రికార్డును బద్దలు కొట్టడం ద్వారా ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 209 పరుగుల లక్ష్యాన్ని 28 బంతులు మిగిలి ఉండగానే ఛేధించడంతో అరుదైన రికార్డును నమోదు చేసింది భారత్.

కాగా, తక్కువ బంతుల్లో 200 కంటే ఎక్కువ లక్ష్యాలను ఛేదించిన జట్లు ఇవే!

28 బంతులు 2026లో రాయ్‌పూర్‌లో భారత్ - న్యూజిలాండ్ (లక్ష్యం: 209)
24 బంతులు 2025లో ఆక్లాండ్‌లో పాకిస్తాన్ - న్యూజిలాండ్ (లక్ష్యం: 205)
23 బంతులు 2025లో బాస్సెటెర్రేలో ఆస్ట్రేలియా - వెస్టిండీస్ (లక్ష్యం: 215)

## ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో హైదరాబాద్ అమ్మాయికి చోటు



స్పోర్ట్స్ న్యూస్, 24 జనవరి (తెలుగు గళం న్యూస్): హైదరాబాద్ బౌలర్ ఎడ్ల సృజనకు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) ఆడే అవకాశం వచ్చింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆమెను తమ జట్టులోకి తీసుకుంది. ఢిల్లీ జట్టుకు చెందిన మమత మడివాలా, దీయా యాదవ్ గాయాల కారణంగా సీజన్ మొత్తానికి దూరమయ్యారు. దీంతో సృజనకు చాన్స్ దక్కింది. ఢిల్లీ రూ.10 లక్షలకు ఆమెతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటివరకు ఢిల్లీ జట్టుకే సృజన నెట్ బౌలర్‌గా వ్యవహరించింది. నెట్ సెషన్స్‌లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవడంతో ఆమెకు ఢిల్లీ చాన్స్ ఇచ్చింది. పంజాబ్ ఆల్‌రౌండర్ ప్రగతి సింగ్‌ను కూడా ఢిల్లీ జట్టులో చేరనుంది. ప్రగతి పంజాబ్ మహిళల జట్టు, అండర్-19లో భారత్ 'బి', భారత్ 'ఈ' జట్లకు ఆడింది. ఢిల్లీ టీమ్ శనివారం బెంగళూరుతో తలపడనుంది. ఇప్పటివరకు ఆ జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడగా రెండింట మాత్రమే గెలిచింది.

# సినిమా న్యూస్

## ‘విశ్వంభర’ నుంచి బిగ్ ట్రీట్




మెగాస్టార్ చిరంజీవి అంటేనే రికార్డుల రారాజు అని అంతా చర్చించుకుంటున్నారు. సంక్రాంతికి ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమాతో బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించిన చిరు, ఇప్పుడు తన తదుపరి చిత్రం ‘విశ్వంభర’ తో ప్రేక్షకులను ఒక అద్భుతమైన ఫాంటసీ లోకంలోకి తీసుకెళ్లబోతున్నారు. ‘బింబిసార’ ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈమూవీ, అనౌన్స్‌మెంట్ నుంచే టాలీవుడ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. అయితే ‘విశ్వంభర’ ఇప్పటికే థియేటర్లలోకి రావాల్సి ఉండగా.. వాయిదా పడింది. గతంలో వచ్చిన గ్రాఫిక్స్ సినిమాల కంటే భిన్నంగా, హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉండాలని మేకర్స్ నిర్ణయించుకున్నారు.

దీంతో అభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈక్రమంలో.. తాజాగా, ఈ చిత్రానికి సంబంధించిన వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. త్వరలోనే సినిమా నుంచి ఒక సాలిడ్ వీడియో టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఈ టీజర్ కేవలం గ్లింప్స్ లాగా కాకుండా, మూవీలో ఉండబోయే భారీ ప్రపంచాన్ని, చిరంజీవి పవర్‌ఫుల్ గెటప్‌ను, అబ్బురపరిచే విజువల్స్‌తో చూపించబోతున్నారట. కాగా.. ఈ సినిమాలో చిరంజీవి సరసన స్టార్ బ్యూటీ త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఆషికా రంగనాథ్ కీలక పాత్రలో కనిపించనుంది. వీరిద్దరు చాలాకాలం తర్వాత స్క్రీన్ మీద కనిపించబోతుండటం విశేషం. ఇక ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ మరో లెవల్‌లో ఉండబోతోందని తెలుస్తోంది.

## మా స్వేచ్ఛను కోల్పోతున్నాం

### కియారా అద్వానీ



దేశంలో బీఫ్ అమ్మకాలు, పోర్న్ వీడియోల మీద బ్యాన్ విధించడంపై బాలీవుడ్ నటి కియారా అద్వానీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కైరా గతంలోనే ఈ వ్యాఖ్యలు చేయగా దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఓ ఈవెంట్ లో పాల్గొన్న కియారా అద్వానీ మొదట బీఫ్, ఇప్పుడు పోర్న్ ను బ్యాన్ చేయడం బాధాకరం అని వ్యాఖ్యానించారు. తరవాత దేన్ని బ్యాన్ చేస్తారో ఎవరికీ తెలియదని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 69ఏళ్లు గడిచినా మిలియన్ల కొద్ది స్వతంత్ర్యాన్ని పొందలేకపోతున్నారని చెప్పారు.

తన దృష్టిలో ఫ్రీడమ్ అంటే తను చేయాలనుకునే, తను ప్రేమించే ప్రతి పని చేయడమే అని చెప్పారు. తాను అలాంటి ఫ్రీడమ్ లోనే పెరిగానని చెప్పారు. అంతే కాకుండా ఆ ఫ్రీడమ్ ను ప్రతిఒక్కరూ సరైన మార్గంలో వాడుకోవాలని అన్నారు. కియారా చేసిన వ్యాఖ్యలపై గతంలోనే విమర్శలు వచ్చాయి. భారతదేశం సంప్రదాయ దేశం అని ఇక్కడ అలాంటివి కుదరవని మంచి కోసం మాట్లాడాలి కానీ చెడు కోసం స్వేచ్ఛ లేదని చెప్పడం ఏంటి అంటూ పలువురు మండిపడ్డారు. కాగా ఇప్పుడు నెటిజన్లు మరోసారి ఈ వీడియోను వైరల్ చేస్తున్నారు.

## హీరోగా ప్రభుదేవా కొడుకు



ప్రభుదేవా కొడుకు రిషి రాగ్వేందర్ దేవా లాంచింగ్ గురించి సోషల్ మీడియాలో న్యూస్ వైరల్ అవుతోంది. ప్రభుదేవా తన కుమారుడిని తమిళ సినిమాలో హీరోగా పరిచయం చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని సుధా కొంగర అసిస్టెంట్ డైరెక్టర్ డైరెక్ట్ చేయనున్నారని.. డెబ్యూ డైరెక్టర్ ప్రాజెక్ట్ అని తెలుస్తోంది. 2025 ఫిబ్రవరిలో ప్రభుదేవా తన కొడుకు రిషిని ఒక డ్యాన్స్ వీడియో ద్వారా పరిచయం చేశాడు. ఈ విధంగా ఇద్దరు మొదటిసారి స్టేజ్ షేర్ చేశారు. రిషి తన తండ్రి లాగానే డ్యాన్స్‌ను ఇరగదీయగా.. ఇప్పుడు సినిమా డెబ్యూతో లెగసీ కొనసాగుతోంది. ఈ ప్రాజెక్ట్ గురించి అధికారిక ప్రకటన త్వరలో రానుందని తెలుస్తోంది.

## సోషల్ మీడియాలో ట్రోలింగ్


### పోలీసులకు ఫిర్యాదు చేసిన టాలీవుడ్ నిర్మాత



సోషల్ మీడియాలో తనపై ట్రోలింగ్ చేస్తున్నారని టాలీవుడ్ నిర్మాత ఎస్‌కేఎన్ పోలీసులను ఆశ్రయించారు. తనపై ట్రోలింగ్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తాను నిర్మించిన సినిమాను, అందులో నటించిన నటీనటులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సోషల్ మీడియా పేజీలు, ఛానళ్లు చేస్తున్న ప్రచారం ప్రేక్షకులను తప్పుదోవ పట్టించే విధంగా ఉందని, ఇలాంటి దురుద్దేశపూరిత పోస్టులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దర్యాప్తులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఇటీవల విడుదలైన రాజాసాబ్ సినిమా ఈవెంట్ లో రాజాసాబ్ చూసి తనకు గూస్ బంప్స్ వచ్చాయని అన్నారు. ప్రతి సంక్రాంతికి కోళ్లపై పందెం వేస్తారని ఈ సంక్రాంతికి డైనోసార్ పై వేయండని అన్నారు. అంతేకాకుండా దర్శకుడు మారుతిపై ప్రశంసల జల్లు కురిపించారు. ఎస్కేఎన్ స్పీచ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే రాజాసాబ్ కు నెగిటివ్ టాక్ రావడంతో ఆయనపై, డైరెక్టర్ మారుతిపై దారుణమైన ట్రోలింగ్ మొదలైంది. ఈ నేపథ్యంలోనే ట్రోలింగ్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వారణాసిలో వివాదాస్పద నటి

### జక్కన్న కావాలానే చేస్తున్నాడా?



సూపర్ స్టార్ మహేష్ బాబు - ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న ‘వారణాసి’ మూవీ ఇప్పటికే గ్లోబల్ అటెన్షన్ క్యాచ్ చేసింది. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కనిపించబోతున్నాడు. ఈ ముగ్గురికి సంబంధించిన లుక్స్‌కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ చిత్రంలో మరో బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణే కూడా ఉండబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. నెగెటివ్ షేడ్‌లో కనిపించే పృథ్వీకి జోడీగా దీపిక కీలకపాత్రలో నటించబోతుందని ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. మరోవైపు వర్కింగ్ హవర్స్, రెమ్యూనరేషన్ కారణంగా పలు తెలుగు ప్రాజెక్ట్‌ల నుంచి ఎగ్జిట్ అయిపోయిన ఆమెను నిజంగానే ఈ వివాదాస్పద నటిని జక్కన్న ఏరికోరి తీసుకున్నాడా? అనేది తెలియాల్సి ఉంది. అయితే మరో వర్గం జక్కన్న కావాలనే ఇదంతా చేస్తున్నాడని విమర్శిస్తుండటం విశేషం.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.